సీఎం రేవంత్ తరం కాదు

రాష్ట్ర చిహ్నాన్ని మార్చడం ఆషామాషీ కాదు

- జాతీయ జెండాలోనూ రాచరికపు ఆనవాళ్లు
- మొఘల్ చక్రవర్తులు కట్టిన ఎర్రకోటనూ కూల్చుతారా?
- ఓ చానల్ ఇంటర్వ్యూలో బీఆర్ఎస్ నేత బోయినపల్లి వినోద్‌కుమార్

కరీంనగర్ ప్రతినిధి, మే 30 (నమస్తే తెలంగాణ): రాష్ట్ర అధికార చిహ్నాన్ని మార్చడంపై బీఆర్ఎస్ సీనియర్ నాయకుడు, మాజీ ఎంపీ బోయినపల్లి వినోద్‌కుమార్ తీవ్ర అభ్యంతరం వ్యక్తం చేశారు. అది రేవంత్‌రెడ్డి తరంకాదని పునరుద్ఘాటించారు. చిహ్నంలో రాచరికపు ఆనవాళ్లు ఉన్నాయని చెబుతున్న రేవంత్‌రెడ్డికి జాతీయ జెండాలో అశోకుడి చక్రం ఉన్న విషయం తెలియదా? అని ప్రశ్నించారు. అశోకుడి నాలుగు సింహాల ముద్రను కాంగ్రెస్ పార్టీకి చెందిన మొదటి పార్లమెంట్ సభ ఆమోదించింది. ఇప్పుడు దానిని కూడా మార్చుతారా? అని వినోద్‌కుమార్ ప్రశ్నించారు. గురువారం కరీంనగర్ నుంచి ఓ చానల్‌కు ఇచ్చిన ఇంటర్వ్యూలో ఆయన వరంగల్ ధర్నాలో చెప్పిన విషయాలను మరోసారి ప్రస్తావించారు. అంతకంటే విస్పష్టంగా చర్చకు దారి తీసే అంశాలను ప్రస్తావించారు. పూర్తి వివరాలు ఆయన మాటల్లోనే..

అవివేకమని ఆనాడే చెప్పాను

రేవంత్‌రెడ్డి ప్రభుత్వం మొదటి క్యాబినెట్ మీటింగ్‌లో తెలంగాణ చిహ్నాన్ని మార్చేస్తామని చెప్పడాన్ని అవివేకమని నేను ఆనాడే చెప్పాను. ఇది కరెక్ట్ కాదు అని ఖండించాను. చిహ్నాన్ని మార్చేందుకు ఒక సబ్ కమిటీ వేసి విచారిస్తామని చెప్పారు. ఏదైనా కమిటీ ప్రజాభిప్రాయాన్ని సేకరించిందా? రేవంత్‌రెడ్డి చెప్పినట్టు సివిల్ సొసైటీలో ఏదైనా ప్రజాభిప్రాయ సేకరణ జరిపిందా? కళాకారులు, మేధావులు, వ్యాపారవేత్తలు, డాక్టర్లు, ఇంజినీర్లు, యువకులతోగానీ ఎక్కడైనా చర్చించారా? స్వయంగా సీఎం రేవంత్‌రెడ్డి చెప్పిన నిర్ణయాన్ని ఆయన అమలు జరపలేదు. కేవలం పేరు కోసం మాత్రమే కమిటీ వేశారు. ఈ కమిటీ ఎక్కడా పని చేయలేదు. ఇంకో విషయం ఏమిటంటే రాష్ట్ర చిహ్నం రాచరిక వ్యవస్థకు నిదర్శంగా ఉన్నదని చెప్పారు. దీనిపై నేను ఆదే రోజు స్పందించాను. భారత జాతీయ జెండాలో అశోక చక్రం దేనికి చిహ్నం. దానిని తొలి ప్రధాని పండిత్ జవహర్‌లాల్ నెహ్రూ నాయకత్వంలోని మొదటి రాజ్యాంగ సభ ఆమోదించింది కదా.. ఇందులో కాంగ్రెస్ పార్టీకే చెందిన ప్రధాని నెహ్రూ ప్రముఖ పాత్ర పోషించారు. అశోక చక్రంతో పాటు నాలుగు సింహాలు ఉన్న జాతీయ ముద్ర ఎక్కడి నుంచి తీసుకున్నారు. దాదాపు 2 వేల సంవత్సరాల క్రితం అశోక చక్రవర్తి పరిపాలించినప్పటి చిహ్నం అది. ఇప్పుడు కాంగ్రెస్ పార్టీలో ఉన్న కొత్త బిచ్చగాడు రేవంత్‌రెడ్డికి ఆ పార్టీ నిర్మాణంలో కీలకంగా ఉన్న నెహ్రూ ప్రభుత్వమే ఆమోదించిందనే సంగతి తెలియదా..? జాతీయ జెండాలో అశోక చక్రాన్ని, నాలుగు సింహాలున్న జాతీయ చిహ్నాన్ని తీసేస్తమనే నిర్ణయం తీసుకోవడానికి సోనియా గాంధీ అవకాశం ఇస్తున్నరా? అని ప్రశ్నించదలుచుకున్నా. అందుకే నేను సోనియా గాంధీ, మల్లికార్జున ఖర్గే, రాహుల్ గాంధీకి ఎక్స్‌లో ట్వీట్ చేశాను. సీఎం రేవంత్‌రెడ్డి అధికారాన్ని దుర్వినియోగం చేస్తున్నాడని, దీనిని మీరు ఆమోదిస్తే రేపు దేశ వ్యాప్తంగా చాలా మందికి ఇవే ఆలోచనలు వస్తాయని చెప్పాను. మూడు రంగుల జెండా తీసివేసి కాషాయ జెండాను పెట్టాలని కొందరు, ఎర్ర జెండా ఎగురవేస్తామని మరి కొందరు అంటున్నరు. వాళ్లకు అవకాశం ఇచ్చినట్టే అవుతుందని నేను స్వయంగా సోనియాగాంధీనే అడుగుతున్నాను. జూన్ 2న మీ సమక్షంలో రేవంత్‌రెడ్డి ఈ అంశాన్ని ప్రతిపాదిస్తే, దానిని మీరు అంగీకరిస్తారా? అని సోనియాగాంధీనే ప్రశ్నించదలుచుకున్నాను. అప్పుడు సోనియాగాంధీ నెహ్రూ నిర్ణయాన్ని కూడా వ్యతిరేకించినట్టు అవుతుంది కదా.. కాబట్టి సీనియర్ కాంగ్రెస్ నాయకులకు కూడా నేను విజ్ఞప్తి చేస్తున్న. మీరు కూడా ఆలోచించాల్సిన అవసరం ఉన్నది.

రేవంత్‌రెడ్డి ఏం చెప్పదల్చుకున్నరు?

రేవంత్ రెడ్డికి ఎక్కడ పనిలేదా..? మార్పు మార్పు అన్నడు. రూ.10 వేల రైతుబంధును రూ.15 వేలు చేస్తానని, రూ.2 వేల ఆసరా పెన్షన్లను రూ.4 వేలు చేస్తామని, రూ.2 లక్షల రుణమాఫీ అన్నడు. దీని మీద దృష్టి పెట్టకుండా వివాదాలకు తెరతీస్తున్నాడు. రాష్ట్ర అధికారిక చిహ్నాన్ని రేవంత్‌రెడ్డి ఏ కారణాలతో తొలగిస్తున్నాడు. సరైన కారణాలు చెప్పాలి కదా.. కేవలం రాచరిక వ్యవస్థకు చిహ్నాలుగా ఉన్నదని అంటున్నారు. అంటే భారత జాతీయ జెండాలో ఉన్న అశోక చక్రాన్ని కూడా తొలగించాలని రేవంత్‌రెడ్డి చెబుతున్నారా..? నాలుగు సింహాలున్న జాతీయ చిహ్నాన్ని తొలగించాలని చెబుతున్నారా..? దీనికి కాంగ్రెస్ పార్టీ జవాబు చెప్పాల్సిన అవసరం ఉన్నది.

చిహ్నాలు మార్చడం కేంద్రం పరిధిలో..

తెలంగాణ కొత్త రాష్ట్రం ఆవిర్భవించిన తర్వాత 2015 మార్చి 26న తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వానికి కేంద్ర ప్రభుత్వం పంపించిన జీవో ప్రకారంగా ఇప్పుడున్న అధికారిక చిహ్నం ఆచరణలోకి వచ్చింది. ఇందులో కేంద్ర హోంశాఖ రూల్స్ ఆఫ్ 4 సబ్ క్లాజ్ 2 స్టేట్ ఎంబ్లం ఆఫ్ ఇండియా రెగ్యులేషన్ ఆన్ యూజ్ -2007 ప్రకారంగా కేంద్ర ప్రభుత్వం అనుమతి ఇస్తేగానీ దీనిని మార్చడానికి లేదు. వచ్చే నెల 2న అయ్యే పని మాత్రం కాదు. రాష్ట్రం నుంచి ప్రతిపాదన చేయాలి. కేంద్రం ఆమోదించాల్సి ఉంటుంది. అప్పుడే చిహ్నం మార్చడానికి అవకాశం ఉంటుంది.

నేనే కోర్టుకు వెళ్తా

రాష్ట్ర కోడ్ టీఎస్ కంటే ముందు మేమే టీజీగా పెట్టాలనకున్నాం. కానీ, కొన్ని రాష్ట్రాలకు కోడ్స్ సిమిలర్‌గా ఉన్నందున టీఎస్‌గా నిర్ణయించాం. తమిళనాడు సింబల్‌లో మధుర మీనాక్షి సింబల్ ఉంటుంది. డీఎంకే దాదాపు దేవున్ని నమ్మే పార్టీ కాదు. అయినప్పటికీ దానిని ఆ పార్టీ ముట్టుకోలేదు. అంటే ఒక రాష్ట్ర ప్రభుత్వం తీసుకున్న నిర్ణయాన్ని ఇంకో పార్టీ అధికారంలోకి వచ్చిన తర్వాత కూడా కొనసాగిస్తాయి. ఇప్పుడు తెలంగాణ రాష్ట్రం చిహ్నాన్ని మార్చడానికి జీవో తీసేందుకు వీలు లేదు. దీనిని ఎట్ల మార్చుతారో చూసి నేనే స్వయంగా కోర్టుకు వెళ్లదలుచుకున్నా. వేసవి సెలవులు పూర్తయిన వెంటనే హైకోర్టులో కేసు వేస్తా. రేవంత్‌రెడ్డి ప్రతిపాదన చేసి కేంద్ర ప్రభుత్వానికి పంపించాలి. కేంద్రం ఒప్పుకుంటేనే చిహ్నం మారుతుంది. అది ఏ సమయానికి వస్తుందో నాకు తెలియదు. రేవంత్‌కు, ఇప్పుడున్న మోడీకి ఉన్న సంబంధాలు ఎట్లా ఉన్నాయో.. రేపు ఏ ప్రభుత్వం వస్తుందో ఎవరికీ తెలియదు.

ఇదంతా రేవంత్ హడావిడే..

రేవంత్‌రెడ్డి ఈ హడావిడి ఎందుకు చేస్తున్నాడు అంటే చేస్తున్న తప్పులకు ప్రజా ఆగ్రహానికి గురి కాకుండా పక్కదారి పట్టించేందుకే. సమస్యలు గాలికి వదిలేసి ఇలాంటి వివాదాలు ముందుకు తెచ్చి పెడుతున్నారు. నిజానికి ఇప్పుడు రైతుబంధు వేయాల్సి ఉంటుంది. రైతులు కోత కోసినప్పుడు రైతుబంధు ఇచ్చుడు కాదు. తొలకరి జల్లులు పడినప్పుడు ఇవ్వాలి. ఇప్పుడు విత్తనాల కోసం రైతులు తన్నుకు చస్తున్నారు. ఇలాంటి పరిస్థితి పదేళ్లలో ఎప్పుడైనా ఉన్నదా..? చెప్పులు, డబ్బాలు క్యూ లైన్లలో పెట్టుకున్నారా?, ఇలాంటి సమస్యలను సైడ్ ట్రాక్ చేసేందుకే కొత్త సమస్యను తెచ్చి ముందు పెడుతున్నారు.

ఎర్రకోటను కూల్చి వేస్తారా?

నాటి నెహ్రూ నుంచి నేటి ప్రధాని నరేంద్ర మోదీ వరకు ఎర్రకోటపై జాతీయ జెండాను ఎగురవేస్తున్నారు. మరీ ఆ ఎర్రకోటను ఎవరు కట్టారు. విదేశాల నుంచి వచ్చి దేశాన్ని ఆక్రమించుకున్న మొఘల్ చక్రవర్తులు కదా? కట్టింది. మరీ కాకతీయులు.. సన్ ఆఫ్ ద సాయిల్ ఇక్కడ పుట్టిన బిడ్డలు. ఎర్ర కోటను మన వాళ్లు కట్టలేదని దాన్ని కూల్చి జెండా ఎగుర వేస్తున్నారా? అన్నీ మతిలేని, తలతిక్క పనులు చేస్తున్నారు. రేవంత్‌రెడ్డి ఎర్రకోటపై జాతీయ జెండాను ఎగురవేయడాన్ని తప్పుపడుతున్నారా..? ఇప్పుడు ముఖ్యమంత్రి చేయాల్సిన పనులు పక్కన పెట్టి పని చేతకాక, అసలు పని వదిలిపెట్టి ఎందుకీ వివాదాలు చెలరేపుతున్నారు.

తెలంగాణ సోయిని చంపేస్తున్నాడు

తెలంగాణ ఉనికి, సోయి, స్పృహ, కళ, చైతన్యాన్ని చంపడానికే రేవంత్‌రెడ్డి అధికారంలోకి వచ్చాడు. ఇంకొద్ది రోజులైతే అధికారంలోకి వచ్చి ఆరు నెలలు అవుతుంది. ఒక్కసారైనా జై తెలంగాణ అన్నారా..? తెలంగాణ రాకముందు ఒక గన్ పట్టుకొని కరీంనగర్ వచ్చాడు. చంద్రబాబు బలం చూసుకుని ఉద్యమాన్ని అణచి వేస్తానని విర్రవీగాడు. అది ఇప్పటికీ ఆయన రక్తంలో ఉన్నది. కేసీఆర్ ఆనవాళ్లని తొలగించాలనేది ఒక అంశమైతే తెలంగాణపైనే ఆయనకు వ్యతిరేకత ఉన్నట్టు స్పష్టంగా తెలుస్తోంది. నేను వరంగల్‌లో కూడా ఇదే చెప్పాను. ఇపుడు కరీంనగర్‌లో ఉండి చెబుతున్నా. కాకతీయ యూనివర్సిటీలో లా చదివిన విద్యార్థిగా చెబుతున్నా. వేసవి సెలవులు ముగియగానే హైకోర్టులో ఈ విషయమై కేసు వేస్తా. ఇలాంటి పనులు కూడా చేయవచ్చా? అని కోర్టును అడుగుతా. కాంగ్రెస్‌ను కూడా అందులో పార్ట్ చేస్తా. దీనిని దేశ వ్యాప్త చర్చకు దారితీసేలా నేను ముందుండి నడిపిస్తా. అంతే కాకుండా నిబంధనలకు విరుద్ధంగా చిహ్నాలను తొలగించాలనే ప్రయత్నం రేవంత్ రెడ్డి చేస్తే, మేం అధికారంలోకి వచ్చిన వెంటనే మార్చి పడేస్తాం.

బడేభాయ్.. చోటేభాయ్ కుమ్మక్కయ్యారా?

- అందుకే లోగోలో చార్మినార్ బొమ్మ తొలగిస్తున్నారా?
- దీనిపై బీజేపీ మాట్లాడాలి?
- బీఆర్ఎస్ నేత దేవీప్రసాద్

హైదరాబాద్, మే 30 (నమస్తే తెలంగాణ): బడేభాయ్ చోటేభాయ్ కుమ్మక్కయ్యారా? అందుకే రాష్ట్ర రాజముద్ర నుంచి చార్మినార్ చిత్రాన్ని తొలగిస్తున్నారా? అని బీఆర్ఎస్ నేత దేవీప్రసాద్ నిలదీశారు. ఈ అంశంపై బీజేపీ నేతలు ఎందుకు మాట్లాడటం లేదని ప్రశ్నించారు. రాష్ట్రంలో ప్రభుత్వాలు మారినప్పుడల్లా చిహ్నాలను మారుస్తూ పోతే ఎలా? అని ప్రశ్నించారు. గురువారం తెలంగాణ భవన్‌లో మీడియాతో ఆయన మాట్లాడుతూ.. చార్మినార్, కాకతీయ కళాతోరణం బొమ్మలను రాజముద్ర నుంచి తొలగించడంపై ఆందోళన వ్యక్తం చేశారు. చార్మినార్ శాంతికి, గంగజమునా తెహజీబ్‌కు ప్రతీకగా ఉన్నదని తెలిపారు. తెలంగాణ ఉద్యమంలో ఏనాడూ పాల్గొనని రేవంత్‌రెడ్డికి అమరవీరులకు నివాళ్లు అర్పించే నైతిక అర్హత లేదని చెప్పారు. కొత్త చిహ్నాలతో తెలంగాణ చరిత్రను మాయం చేయాలని చేస్తున్నారని తెలిపారు. చిహ్నాల మార్పు బీఆర్ఎస్, కాంగ్రెస్‌ల వివాదం కాదని, తెలంగాణ ప్రజల అస్తిత్వమని పేర్కొన్నారు. బీఆర్ఎస్వీ రాష్ట్ర అధ్యక్షుడు గెల్లు శ్రీనివాస్‌యాదవ్ మాట్లాడుతూ.. తెలంగాణ అస్థిత్వంపై సీమాంధ్ర కుట్రలో సీఎం భాగస్వామ్యం అవుతున్నారని ఆరోపించారు. తెలంగాణ జేఏసీ చైర్మన్‌గా చేసిన కోదండరాం దీనిపై ఆత్మవిమర్శ చేసుకోవాలని సూచించారు. చిహ్నం మార్పుపై ఒవైసీ స్పందించాలని డిమాండ్ చేశారు. కోదండరాం లాంటి వాళ్లు పక్కనే ఉండి రేవంత్ చర్యలను సమర్థించడం విడ్డూరంగా ఉన్నదని విమర్శించారు. సమావేశంలో మాజీ ఎమ్మెల్యే నోముల భగత్, రూప్ సింగ్,శ్రీనివాస్‌యాదవ్ పాల్గొన్నారు.

వరంగల్ జిల్లా ఖిలావరంగల్ కోటలోని కాకతీయ కీర్తి తోరణం ఎదుట నిరసన తెలుపుతున్న బీజేపీ నాయకులు

కాకతీయ తోరణం తొలగింపుపై బీజేపీ నిరసన

ఖిలావరంగల్, మే 30: రాష్ట్ర చిహ్నం నుంచి కాకతీయ కళాతోరణాన్ని తొలగించాలన్న ప్రభుత్వ నిర్ణయంపై నిరసనలు వ్యక్తమవుతున్నాయి. గురువారం వరంగల్ జిల్లా ఖిలా వరంగల్‌లోని కీర్తి తోరణం వద్ద బీజేపీ ఆధ్వర్యంలో నిరసన చేపట్టారు. ఈ సందర్భంగా బీజేపీ వరంగల్ జిల్లా అధ్యక్షుడు గంట రవికుమార్ మాట్లాడుతూ.. కాకతీయ కళాతోరణం రాచరికపు ఆనవాళ్లు కాదని, ఓరుగల్లు రాజసమని, తెలంగాణ ఆత్మగౌరవ ప్రతీక అని పేర్కొన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం విద్యార్థులు, నిరుద్యోగులు, రైతుల సమస్యలను గాలికి వదిలేసి రాష్ట్ర చిహ్నం నుంచి కీర్తితోరణం తొలగించేందుకు చేస్తున్న కుట్రను ఖండిస్తున్నామని చెప్పారు. ప్రభుత్వం నిర్ణయం మార్చుకోకపోతే ప్రజాగ్రహానికి గురికాక తప్పదని హెచ్చరించారు. కార్యక్రమంలో బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు కుసుమ సతీశ్, రత్నం సతీశ్‌షా, రాణాప్రతాప్‌రెడ్డి పాల్గొన్నారు.

కొత్త లోగోను ఉపసంహరించాలి

రేవంత్ ప్రభుత్వం రూపొందించిన తెలంగాణ రాష్ట్ర కొత్త లోగో ఏ ధర్మాన్నీ లేదా చరిత్రను ప్రతిబింబించడం లేదు. తెలంగాణ ప్రాంతంపై ప్రధానంగా ఓరుగల్లును పాలించిన కాకతీయ రాజులు, గోల్కొండను ఏలిన కుతుబ్‌షాహీ పాలకుల ప్రభావం ఉన్నది. పాత లోగోలో ఉన్న చార్మినార్, కాకతీయ కళాతోరణం గుర్తులు మన చరిత్రకు, పూర్వాపరాలకు అద్దం పట్టాయి. ఈ గుర్తులే తెలంగాణకు ప్రత్యేక గుర్తింపు తీసుకొచ్చాయి. కానీ కొత్త లోగో ఎటూకాకుండా ఉన్నది. రేవంత్‌రెడ్డి ప్రభుత్వం కొత్త లోగోను వెంటనే ఉపసంహరించుకోవాలి.

- మోహన్ గురుస్వామి, రచయిత

తెలంగాణ వ్యతిరేకులతో 'అఖిలపక్షం'

- సచివాలయంలో సీఎం సమావేశం
- తెలంగాణను వ్యతిరేకించిన సీపీఎం ఎంఐఎం పార్టీలకు అందిన ఆహ్వానం
- తెలంగాణ రాష్ట్రాన్ని సాధించిన బీఆర్ఎస్‌కు బిల్లుకు మద్దతిచ్చిన బీజేపీకి అవమానం
- మండిపడుతున్న తెలంగాణవాదులు

హైదరాబాద్, మే 30 (నమస్తే తెలంగాణ): తెలంగాణ రాష్ట్ర అవతరణ వేడుకలు, రాష్ట్ర చిహ్నం మార్పు, రాష్ట్ర గీతానికి ఆమోదం తదితర అంశాలపై సీఎం రేవంత్‌రెడ్డి అధ్యక్షతన సచివాలయంలో గురువారం సాయంత్రం అధికారికంగా నిర్వహించిన అఖిలపక్ష సమావేశం మరో వివాదానికి దారితీసింది. తెలంగాణ రాష్ట్ర ఏర్పాటును మొదటి నుంచి వ్యతిరేకించడమే కాకుండా తమ స్టాండ్ ఇప్పటికీ మార్చుకోని సీపీఎంను, రాష్ట్ర విభజన వద్దంటే వద్దన్న ఎంఐఎం పార్టీని సమావేశానికి ప్రభుత్వం ఆహ్వానించింది. రాష్ట్రాన్ని సాధించిన పార్టీగానే కాకుండా ప్రస్తుతం ప్రధాన ప్రతిపక్షంగా ఉన్న బీఆర్ఎస్ పార్టీకి మాత్రం ఆహ్వానం అందకపోవడంపై విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. అంతేకాదు, తెలంగాణ బిల్లుకు పార్లమెంట్‌లో మద్దతు ఇచ్చిన బీజేపీకి కూడా ఆహ్వానం అందలేదు. ఎన్నికల కోడ్ ఉన్నప్పటికీ దశాబ్ది వేడుకల నిర్వహణకు ఎన్నికల కమిషన్ అనుమతి పొందిన ప్రభుత్వం సచివాలయంలో అధికారికంగా నిర్వహించిన సమావేశానికి ప్రధాన ప్రతిపక్షాన్ని, ప్రతిపక్షాన్ని ఆహ్వానించకపోవడం ఎన్నికల కమిషన్ ఇచ్చిన అనుమతిని దుర్వినియోగపరచడమే అవుతుందన్న విమర్శలు వినిపించాయి. శాసనసభలో అసలు ప్రాతినిధ్యం కూడా లేని, తెలంగాణ వ్యతిరేక సీపీఎంను ఎలా ఆహ్వానిస్తారని తెలంగాణవాదులు ప్రశ్నిస్తున్నారు. సచివాలయం వేదికగా అధికారికంగా నిర్వహించిన అఖిలపక్ష సమావేశాన్ని కాంగ్రెస్ పార్టీ సమావేశంగా మార్చడంపై తెలంగాణవాదులు, ఉద్యమకారులు మండిపడుతున్నారు. సచివాలయాన్ని గాంధీభవన్‌గా మార్చారన్న విమర్శలు వెల్లువెత్తాయి. అఖిలపక్ష సమావేశంలో కాంగ్రెస్ రాష్ట్ర వ్యవహారాల ఇన్‌చార్జి దీపాదాస్ మున్షీ ఏ హోదాలో రాష్ట్ర ప్రభుత్వం అధికారికంగా నిర్వహించిన సమావేశానికి హాజరయ్యారని నిలదీస్తున్నారు. ప్రధాన ప్రతిపక్షం బీఆర్ఎస్, ప్రతిపక్ష బీజేపీ అభిప్రాయాలను పరిగణనలోకి తీసుకోకుండా శాసనసభలో ప్రాతినిధ్యం లేని సీపీఎం అభిప్రాయానికి ఎలా విలువ ఉంటుందని ప్రశ్నిస్తున్నారు.

ఎల్లుండి జిల్లాల్లో జాతీయ పతాకావిష్కరణ

- రాష్ట్రావతరణ వేడుకలకు ఘనంగా ఏర్పాట్లు

హైదరాబాద్, మే 30 (నమస్తే తెలంగాణ): రాష్ట్ర అవతరణ దినోత్సవం సందర్భంగా జూన్ 2న జిల్లా కేంద్రాల్లో కలెక్టర్లు జాతీయ పతాకావిష్కరణ చేయాలని సీఎస్ శాంతికుమారి సూచించారు. రాష్ట్ర అవతరణ ఉత్సవాల నిర్వహణ, విత్తన సరఫరాపై గురువారం ఆమె కలెక్టర్లతో టెలి కాన్ఫరెన్స్ నిర్వహించారు. రాష్ట్రావతరణ వేడుకలకు ఘనంగా ఏర్పాట్లు చేసినట్టు తెలిపారు. జిల్లా కేంద్రాల్లో జరిగే కార్యక్రమాలకు ప్రజాప్రతినిధులను, ఇతర ప్రముఖులను, జిల్లా అధికారులను ఆహ్వానించాలని చెప్పారు. హైదరాబాద్‌లో జరిగే ఉత్సవాలకు విస్తృత ఏర్పాట్లు చేయాలని ఆదేశించారు. ప్రతి శాఖ నుంచి ఒక నోడల్ అధికారిని నియమించి సమన్వయంతో పనిచేయాలని ఆదేశించారు. రాష్ట్రంలో విత్తనాలను బ్లాక్ మార్కెట్లకు తరలించి, కృత్రిమ కొరత సృష్టించే వ్యాపారులపై పీడీ యాక్ట్ కింద కేసులు నమోదు చేయాలని కలెక్టర్లను సీఎస్ శాంతికుమారి కలెక్టర్లను ఆదేశించారు. కాన్ఫరెన్స్‌లో డీజీపీ రవిగుప్తా తదితరులు పాల్గొన్నారు.

BHARAT SANCHAR NIGAM LIMITED
(A GOVT OF INDIA ENTERPRISE)
O/oPGM, HTD, BSNL Bhavan, Adarshnagar, Hyderabad-63

సరికొత్త వ్యాపార అవకాశం

భారత్ సంచార్ నిగం లిమిటెడ్ వారి చే హైదరాబాద్ ప్రాంతం లో వ్యాపార భాగ స్వాములకు ఆహ్వానం

1) ఆర్థికీయమైన ఆదాయ పంపకం పద్ధతిపై (TIPS)- ఆప్టికల్ ఫైబర్ పై 'ఫైబర్ టు హోమ్ ఎక్స్టెన్షన్ ఇన్ఫ్రాస్ట్రక్చర్' మరియు హై స్పీడ్ బ్రాండ్ బ్రాండ్ సేవల పర్యాటు (FTTH).
Mail ID:htdfttth@gmail.com, Phone.no: 040-23234343,
Officer to contact: Sri.K Kumar, SDE(FMS), Mobile: 8500174988

2) పరిమిత కాలానికి, ఆర్థికీయమైన కమిషన్ పై - బి.ఎస్.ఎన్.ఎల్ మొబైల్ సిమ్ అమ్మకాలు/ సేవల కోసం సేల్స్ రిప్రజెంటేటివ్ (SR)/ బైబ్యాక్ పెర్సెంట్ ఏజెంట్ (DSA)-
Mail Id:htdsalesbsnl@gmail.com,Phone:040-23227847,
Officer to contact: Sri.D.RamaKrishna, SDE(Sales) CM, Mobile: 9490747847

ఆసక్తి గల వ్యాపారస్తులు సంప్రదించ గలరు Room No: 102 (For FTTH) O/o Principal General Manager, BSNL, Adarsh Nagar, Hyderabad-500063. CIN: U74899DL2000GOI107739

SALAR JUNG MUSEUM, HYDERABAD
e-Publishing Notice

Tenders are in invited under e-publishing platform for Supply, fixing and Installation including Site Work of Tensile Structure for main walkway entrance in Salar Jung Museum.
Tenderers can download the tender schedules from procurement site i.e **www.eprocure.gov.in/CPPP.** Submission of tenders offline at Salar Jung Museum, Hyderabad.

Bid publish date	:	30.05.2024, 11.00 AM.
Bid Submission closing date	:	13.06.2023, 3.00 PM.
Bid opening Date	:	13.06.2023, 3.30 PM.

Further details can be seen at **www.eprocure.gov.in/cppp.**
- Tender ID:2024_SJM_758178_1

Sd/-
DIRECTOR

చిహ్నంపై పీఛేముడ్

మొదటిపేజీ తరువాయి...

చేయనున్నట్టు తెలిపారు. రాష్ట్ర గీతంతో పాటు దశాబ్ది ముగింపు వేడుకల నిర్వహణపై చర్చించారు. ఈ సందర్భంగా కీరవాణి సంగీత సారథ్యంలోని యువ గాయకుల బృందం గీతాన్ని ఆలపించింది. 'జయ జయహే తెలంగాణ' గీతాన్ని రెండు వెర్షన్లలో రూపొందించినట్టు రేవంత్‌రెడ్డి తెలిపారు. పూర్తి గీతం 13.30 నిమిషాలు ఉంటుందని, ప్రభుత్వ కార్యక్రమాల్లో ఆలపించేందుకు వీలుగా మూడు చరణాలతో సంక్షిప్త గీతం 2.30 నిమిషాలు ఉంటుందని వివరించారు. ఈ రెండింటినీ రాష్ట్ర గీతంగానే పరిగణిస్తామని స్పష్టం చేశారు. ఉద్యమకాలంలో అందరినీ ఉర్రూతలూగించిన, తెలంగాణ ఖ్యాతిని చాటిన గీతాన్ని భవిష్యత్తు తరాలు పాడుకునేలా అందరి ఆమోదంతోనే రాష్ట్ర గీతంగా ఆమోదించినట్టు తెలిపారు. కవి, రచయిత అందెశ్రీ ఇరవై ఏండ్ల కిందట రాసిన గీతాన్ని యథాతథంగా ఆమోదించినట్టు పేర్కొన్నారు. ఆస్కార్ అవార్డు గ్రహీత కీరవాణి సంగీతంతోపాటు స్వరాలు కూడా కూర్చినట్టు తెలిపారు. రాష్ట్ర ఆవిర్భావ వేడుకల్లో భాగంగా ఈ గీతాన్ని జాతికి అంకితం చేస్తామని తెలిపారు.

చిహ్నం, తెలంగాణ తల్లిపై అసెంబ్లీలో చర్చిస్తాం

తెలంగాణ పునర్నిర్మాణంలో భాగంగా క్యాబినెట్‌లో తీసుకున్న నిర్ణయం మేరకే రాష్ట్ర గీతాన్ని ఆమోదించామని, రాష్ట్ర ప్రభుత్వ అధికారిక చిహ్నం, తెలంగాణ తల్లి విగ్రహాన్ని మార్చాలని నిర్ణయించామని పేర్కొన్నారు. చిహ్నంపై రాష్ట్రంలోని వివిధ ప్రాంతాల కళాకారుల నుంచి దాదాపు 500 నమూనాలు తమకు అందినట్టు చెప్పారు. తెలంగాణ తల్లి విగ్రహానికి సంబంధించి కళాకారులు వివిధ నమూనాలు తయారు చేస్తున్నట్టు తెలిపారు. కొత్త చిహ్నం, తెలంగాణ తల్లి విగ్రహాలకు సంబంధించి అపోహాలు, తప్పుడు ప్రచారాలకు తావు లేకుండా అసెంబ్లీలో చర్చించి నిర్ణయం తీసుకుంటామని పేర్కొన్నారు. కార్యక్రమంలో శాసనమండలి చైర్మన్ గుత్తా సుఖేందర్‌రెడ్డి, శాసనసభ స్పీకర్ గడ్డం ప్రసాద్, మంత్రులు ఉత్తమ్‌కుమార్‌రెడ్డి, కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి, దామోదర రాజనర్సింహ, పొంగులేటి శ్రీనివాసరెడ్డి, తుమ్మల నాగేశ్వరరావు, జూపల్లి కృష్ణారావు, సీతక్క, కొండా సురేఖతో పాటు మాజీమంత్రి జానారెడ్డి, ప్రొఫెసర్ కోదండరాం, కవి అందెశ్రీ, సంగీత దర్శకుడు కీరవాణి, సీపీఐ ఎమ్మెల్యే కూనంనేని సాంబశివరావు, సీపీఎం రాష్ట్ర కార్యదర్శి తమ్మినేని వీరభద్రం తదితరులు పాల్గొన్నారు.

జూన్ 2న కార్యక్రమాలు ఇలా..

- ఉదయం 9.30 గంటలకు గన్‌పార్క్‌లోని అమరవీరుల స్థూపం వద్ద సీఎం రేవంత్‌రెడ్డి నివాళులు అర్పిస్తారు.
- 10 గంటలకు పరేడ్‌గ్రౌండ్‌లో జాతీయ పతాకాన్ని సీఎం ఆవిష్కరిస్తారు. పోలీసు బలగాల పరేడ్, మార్చ్ ఫాస్ట్, వందన స్వీకారం ఉంటుంది.
- అనంతరం తెలంగాణ రాష్ట్ర అధికారిక గీతాన్ని (సంక్షిప్త గీతం) ఆవిష్కరిస్తారు.
- సోనియాగాంధీ, సీఎం రేవంత్‌రెడ్డి ప్రసంగిస్తారు.
- పోలీసు సిబ్బందికి, ఉత్తమ కాంటింజెంట్లకు అవార్డుల ప్రదానం.. వారితో ఫొటో సెషన్ కార్యక్రమం ఉంటుంది.
- సాయంత్రం ట్యాంక్‌బండ్‌పై తెలంగాణ హస్తకళలు, ప్రత్యేక ఉత్పత్తులు, వివిధ రకాల ఫుడ్‌స్టాల్స్‌ను ఏర్పాటు చేస్తారు.
- 6.30 గంటలకు సీఎం రేవంత్‌రెడ్డి ట్యాంక్‌బండ్ చేరుకొని స్టాళ్లను సందర్శిస్తారు.
- అనంతరం దాదాపు 700 మంది కళాకారులు తెలంగాణ కళారూపాలతో కార్నివాల్ నిర్వహిస్తారు.
- ప్రధాన వేదికపై 70 నిమిషాలపాటు వివిధ సాంస్కృతిక నృత్య ప్రదర్శనలు ఉంటాయి.
- అనంతరం జాతీయ జెండాలతో ట్యాంక్‌బండ్‌పై 5వేల మందితో భారీ ఫ్లాగ్ వాక్ నిర్వహిస్తారు. జయ జయహే తెలంగాణ పూర్తి గీతాన్ని విడుదల చేస్తారు. కవి అందెశ్రీ, సంగీత దర్శకుడు ఎంఎం కీరవాణికి సన్మాన కార్యక్రమం ఉంటుంది.
- రాత్రి 8.50 గంటలకు పది నిమిషాల పాటు హుస్సేన్‌సాగర్ మీదుగా బాణాసంచా కార్యక్రమంతో వేడుకలకు ముగింపు.

చుక్కా రామయ్యకు ఆహ్వానం

అంబర్‌పేట, మే 30: జూన్ 2న రాష్ట్ర ప్రభుత్వం ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న అవతరణ ఉత్సవాలకు రావాలని కోరుతూ ప్రముఖ విద్యావేత్త, మాజీ ఎమ్మెల్సీ చుక్క రామయ్యను సీఎం రేవంత్‌రెడ్డి ఆహ్వానించారు. గురువారం సాయంత్రం ఎమ్మెల్సీ మహేశ్‌కుమార్‌గౌడ్, కాంగ్రెస్ పార్టీ సీనియర్ నేత మల్లు రవితో కలిసి విద్యానగర్‌లోని ఆయన ఇంటికి సీఎం స్వయంగా వెళ్లారు. రామయ్యను శాలువాతో సన్మానించారు. రాష్ట్రావతరణ ఉత్సవాల్లో తప్పనిసరిగా పాల్గొనాలని కోరారు. రామయ్య ఆరోగ్య పరిస్థితిని అడిగి తెలుసుకున్నారు.

రాజముద్రపై అరాజకీయం